క్లుప్తంగా

జూనియర్ కళాశాల తనిఖీ



విద్యార్థులతో మాట్లాడుతున్న జిల్లా వృత్తి విద్యాధికారి మధుబాబు

కందుకూరు రూరల్: స్థానిక టీఆర్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలను జిల్లా వృత్తి విద్యాధికారి మధుబాబు శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. చదువుపై శ్రద్ధ వహించాలన్నారు. ప్రిన్సిపాల్ కె.నాగేశ్వరరావు, అధ్యాపక సిబ్బంది ఉన్నారు.

సంఘాలను బలోపేతం చేయండి

కందుకూరు రూరల్: వ్యవసాయ సహకార పరపతి సంఘాలను బలోపేతం చేయాలని డివిజనల్ కో ఆపరేటివ్ అధికారి రవిచంద్రా రెడ్డి పేర్కొన్నారు. పలుకూరులో అఖిల భారత 70వ వారోత్సవాలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పెట్రోల్ బంకులు, జనరిక్ మందుల షాపులు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. సబ్ డివిజన్ కో ఆపరేటివ్ అధికారి సుబ్బారావు, సొసైటీ సీఈఓ శ్రీతేజ, బ్యాంక్ సూపర్‌వైజర్ సుధీర్ కుమార్, డీఆర్ ఆఫీస్ సిబ్బంది వేణుగోపాల్, రియాజ్, మోహన్‌రావు, లక్ష్మీ ప్రసన్న పాల్గొన్నారు.

దాతల సహకారం మరువలేనిది



విద్యాసామగ్రి అందజేస్తున్న నాగోతు వెంకట నారాయణ

పీసీపల్లి: విద్యార్థుల విద్యాభివృద్ధికి దాతల సహకారం మరువలేనిదని ఎంఈఓలు సంజీవి, ఆర్. శ్రీనివాసులు అన్నారు. 1998లో డీఎస్సీలో ఎంపికైన తలకొండపాడు నివాసి అయిన నాగోతు వెంకట నారాయణ శుక్రవారం విద్యార్థులకు విద్యాసామగ్రి అందజేశారు. తలకొండపాడు పంచాయతీలో ఉన్న ఎంపీయూపీ స్కూల్, ఎస్సీ పాలెం ఎంపీపీ స్కూల్, పాలేటిపల్లి ఎంపీపీ స్కూల్, పాత ముద్దపాడు ఎంపీయూపీ స్కూల్‌లో విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు, జామెంట్రీ బాక్సులు అందజేశారు.

నూరు శాతం ఫలితాలపై దృష్టి సారించాలి



విద్యార్థుల నోట్‌బుక్స్‌ను పరిశీలిస్తున్న డిప్యూటీ ఈవో చంద్రమౌళీశ్వర్

పామూరు: మండలంలో 2023–24 విద్యాసంవత్సరంలో పాఠశాలల్లోని 10వ తరగతి విద్యార్థులు నూరుశాతం మెరుగైన ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించి అందుకు విద్యార్థులను సంసిద్ధులు చేయాలని మార్కాపురం డిప్యూటీ ఈవో ఎ.చంద్రమౌళీశ్వర్ అన్నారు. కంబాలదిన్నె జెడ్పీహెచ్ఎస్ పాఠశాలను శుక్రవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. హెచ్‌ఎం పఠాన్ మహబూబ్ ఖాన్, ఎల్ఎస్‌పురం జెడ్పీహెచ్ఎస్ హెచ్‌ఎం సయ్యద్ ఇసాక్, ఎంఐఎస్ కోఆర్డినేటర్ విజయ్ భాస్కర్, సిద్ధమూర్తి లక్ష్మిరెడ్డి, ముప్పూరి మల్లికార్జున, ఉపాధ్యాయులున్నారు.

నీమాస్త్రంతో చీడపీడల బెడదకు చెక్



మర్లపాడులో నీమాస్త్రం కషాయం తయారు చేస్తున్న ప్రకృతి వ్యవసాయాధికారి విజయలక్ష్మి

టంగుటూరు: పంటలకు సోకే చీడ పీడ పురుగులు నివారణకు నీమాస్త్రం దివ్య ఔషధంగా పనిచేస్తుందని ప్రకృతి వ్యవసాయాధికారి విజయలక్ష్మి పేర్కొన్నారు. మండలంలోని మర్లపాడు గ్రామంలో శుక్రవారం రైతు ఉమా మహేశ్వరరావు సాగు చేస్తున్న మామిడి మొక్కల్లో పురుగులు, దోమల నివారణకు నీమాస్త్రం కషాయం తయారు చేశారు. 5 కేజీల వేపాకు ముద్ద, 10 లీటర్ల ఆవు మూత్రం, 5 కేజీల దేశీ ఆవు పేడ మిశ్రమాన్ని ఒక డ్రమ్ములో కొన్ని గంటలు మురగపెట్టడం ద్వారా నీమాస్త్రం కషాయం తయారు చేశారు. దీనిని పంటలపై పిచికారీ చేయడం ద్వారా చీడపీడల తోపాటు దోమలను అరికట్టవచ్చని తెలిపారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతులు పాటించడం ద్వారా తక్కువ ఖర్చుతోపాటు అధిక ఆదాయం లభిస్తోందని, ప్రకృతి వ్యవసాయానికి రాష్ట్ర ప్రభుత్వం పూర్తి తోడ్పాటునిస్తూ రైతులకు అండగా నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది విజయలక్ష్మి, ఐసీఆర్పీలు శృతి, హరిత, మరియమ్మ, సుజాత, రైతులు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో నాగుల చవితి



కనిగిరి: దొరువు వద్ద గల నాగపుట్టకు ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు



పామూరు అంకాళమ్మ వీధిలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు



సీఎస్‌పురం శివాలయంలో పుట్టవద్ద పూజలు చేస్తున్న భక్తులు



పీసీపల్లి: నాగులకు పూజలు చేస్తున్న భక్తులు

కనిగిరి రూరల్: నాగుల చవితి వేడుకలను కనిగిరి, కందుకూరు, కొండపి నియోజకవర్గాల్లో శుక్రవారం ఘనంగా జరిగాయి. కనిగిరిలో శుక్రవారం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. పట్టణంతో పాటు, వివిధ గ్రామాల్లో గల శివాలయాల్లో, నాగేంద్ర స్వాములకు, నాగ శిలలకు, నాగ పుట్టల వద్ద ప్రత్యేక పూజలు జరిగాయి. పట్టణంలోని దొరువు వద్ద గల నాగపుట్ట వద్ద భక్తులు కిట కిటలాడారు.

పామూరు: మండలంలోని ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని అంకాళమ్మవీధిలో గల సుబ్రమణ్యేశ్వరస్వామి పుట్టవద్ద, స్థానిక మదనవేణుగోపాలస్వామి దేవస్థానంలోగల జంటనాగులకు, సీ.ఎస్.పురం రోడ్డులోని పుట్టవద్ద పూజలు నిర్వహించారు.

హనుమంతునిపాడు: మండలంలో శుక్రవారం నాగుల చవితి వేడుకలను భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ప్రత్యేకంగా పుట్టను అలంకరించి నాగ దేవతకు పూజలు నిర్వహిచి కొబ్బరి కాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు.

సీఎస్‌పురం (పామూరు): కామాక్షీసమేత చంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలో భక్తులు పుట్ట, జంట నాగులకు విశిష్ట పూజలు నిర్వహించి మొక్కలు తీర్చుకున్నారు. శీలంవారిపల్లెలో నాగమయ్య ఆలయంలో పూజలు నిర్వహించారు.

పీసీపల్లి: పెదయిర్లపాడులో ఉన్న శ్రీమల్లేశ్వర స్వామి దేవస్థానంలో వెలసిన నవనాగులకు భక్తులు ప్రత్యేక పూజలు, షోడషపూజలు, పాలాభిషేకాలు నిర్వహించారు. నాగులకు పూజలు నిర్వహించడం ద్వారా దోషాలు తొలగుతాయని భక్తుల విశ్వాసం.

గుడ్లూరు: నాగుల చవితి పండగ వేడుకలు మండలంలోని అన్ని గ్రామాల్లో ప్రజలు శుక్రవారం భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. దీపావళి పండుగ ముగిసిన ఐదో రోజున నాగుల చవితి జరుపుకున్నారు.

కందుకూరు రూరల్: మండలంలో పలు గ్రామాల్లో నాలుగు చవితి వేడుకలు ఘనంగా నిర్వహించారు. మాచవరం, మోపాడు, కొండముడుసుపాలెం, ఓగూరు తదితర గ్రామాల్లో మహిళలు తెల్లవారుజాము నుంచే శివాలయాల్లో పూజలు నిర్వహించారు.

లింగసముద్రం: పెదపవని శివాలయానికి, మొగిలిచర్ల దత్తాత్రేయస్వామి మందిరం వద్ద శివాలయానికి, స్థానిక పంచాయతీలోని వాకమళ్ళవారిపాలెంలో ఉన్న అయ్యప్పస్వాం దేవాలయంలో ఉన్న శివాలయానికి భక్తులు పోటెత్తారు. పుట్టకు పాలుపోసి ప్రదక్షిణలు చేశారు.



టంగుటూరులో పుట్ట వద్ద పూజలు చేస్తున్న మహిళలు



మాచవరంలో కొండ వద్ద పుట్ట వద్ద పూజలు చేస్తున్న మహిళ

ఉలవపాడు: ఉలవపాడులోని నాగేంద్ర స్వామికి పూజలు నిర్వహించారు. కొబ్బరికాయలు కొట్టి తమ మొక్కులు తీర్చాలని వేడుకున్నారు.

భక్తిశ్రద్ధలతో నాగులచవితి

పొన్నలూరు/టంగుటూరు/జరుగుమల్లి/మర్రిపూడి: నాగుల చవితి పర్వదినాన్ని శుక్రవారం కొండపి నియోజకవర్గ ప్రజలు భక్తి శ్రద్ధలతో నిర్వహించుకున్నారు. మహిళలు నాగేంద్రుని పుట్టలో పాలు పోసి పూజలు చేశారు. నాగేంద్రునికి వడపప్పు, సజ్జలు, చలివిడిని నైవేద్యంగా సమర్పించారు. పొన్నలూరు మండలం ముత్తరాసుపాలెంలో, టంగుటూరు తహసీల్దార్ కార్యాలయం సమీపంలోని పుట్ట, జరుగుమల్లిలో పుట్ట, మర్రిపూడి మండలంలోని గుండ్లసముద్రం, మర్రిపూడి, కూచిపూడి, జువ్విగుంట, రావిళ్లవారిపాలెం, ధర్మవరం, గార్లపేట తదితర గ్రామాల్లో భక్తులు ఉపవాసాలు ఉండి పూజలు చేశారు. పుట్టలను పసుపు, కుంకుమ పూలమాలలతో ప్రత్యేకంగా అలంకరించారు. గుండ్లసముద్రం గ్రామంలో భక్తులు భజన గీతాలు ఆలపించారు.



హెచ్‌ఎంపాడులో పుట్టకు పూజలు చేస్తున్న మహిళలు



ఉలవపాడు: పుట్టచుట్టూ ప్రదక్షిణలు చేస్తున్న మహిళలు



ముత్తరాసుపాలెంలో పుట్టకు ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు



గుండ్లసముద్రంలో పుట్టకు పూజలు చేస్తున్న భక్తులు

ఆరోగ్య కేంద్రం తనిఖీ

కనిగిరి రూరల్: ప్రజా ఆరోగ్య రక్షణే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనేక పథకాలను అమలు చేస్తున్నారని మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్ అన్నారు. పట్టణంలోని ఇందిరా కాలనీలోగల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శుక్రవారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. డాక్టర్ ఫణీకుమార్ పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ క్షేత్రం పరిశీలన



ప్రకృతి వ్యవసాయం గురించి విద్యార్థులకు వివరిస్తున్న రైతు వెంకటేశ్వర్లు

కందుకూరు రూరల్: టీఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన వృక్ష శాస్త్ర, జంతు శాస్త్ర విద్యార్థులు వెంకటాద్రిపాలెంలో ఆర్గానిక్ పంట సాగు చేస్తున్న జిల్లెళ్లమూడి వెంకటేశ్వర్లు పొలాలను శుక్రవారం పరిశీలించారు. 15 రకాల కూరగాయల పెంపకం పట్ల అభినందించారు. అధ్యాపకులు ఎస్. తిరుపతి స్వామి, బాలునాయక్, ఐ.అనూష, డి.ఇంద్రజ, విద్యార్థులు పాల్గొన్నారు.

కుమార్తె కనిపించడం లేదని ఫిర్యాదు

లతన కుమార్తె మూడు రోజుల నుంచి కనిపించడం లేదని మండలంలోని చినలాటరిఫి గ్రామానికి చెందిన తలపల తిరుపాలు స్థానిక పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం ఫిర్యాదు చేశారు. వివరాల ప్రకారం.. తిరుపాలు కుమార్తె కౌసల్య పదో తరగతి వరకు చదువుకొని ఇంటి వద్దే ఉంటోంది. మూడు రోజుల క్రితం తన తమ్ముడితో గొడవ పడింది. దీంతో మనస్తాపం చెందిన యువతి కుటుంబ సభ్యులు లేని సమయం చూసి వెళ్లిపోయింది. పనులకు వెళ్లి ఇంటికి వచ్చిన తల్లిదండ్రులకు కుమార్తె కనిపించకపోవడంతో చుట్టు పక్కల ఉన్న బంధువుల వద్ద వాకాబు చేశారు. ఎక్కడా కనిపించకపోవడంతో పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న పోలీసులు తెలిపారు.

గ్రంథాలయాలు విజ్ఞాన వనాలు



టంగుటూరులో మాట్లాడుతున్న ప్రముఖ రచయిత కవి బీసీడి కృష్ణయ్య

టంగుటూరు: విద్యార్థులు గ్రంథాలయాల ద్వారా విజ్ఞానం పెంపొందించుకోవచ్చని ప్రముఖ రచయిత కవి బీసీడి కృష్ణయ్య పేర్కొన్నారు. జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా స్థానిక గ్రంథాలయంలో నాలుగో రోజు శుక్రవారం కవి సమ్మేళనం, రచయితల సందేహాలు, సెమినార్లు నిర్వహించారు. ముఖ్య అతిథులుగా హాజరైన రచయిత బీసీడి కృష్ణయ్య, నెమ్మాని సీతారామమూర్తి తమ సందేశాన్ని అందించారు. అనంతరం విద్యార్థులకు దిశ చట్టంపై వ్యాస చచన పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గాయకులకు ఘన సన్మానం

జరుగుమల్లి: గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా స్థానిక గ్రంథాలయంలో శుక్రవారం కవి సమ్మేళనం నిర్వహించారు. గ్రామానికి చెందిన పలువురు పద్య గాయకులు పద్యాలు, పాటలు ఆలపించారు. పద్య గాయకులు చీరాల బాలయ్య, కలికివాయి శ్రీనివాసరావును లైబ్రేరియన్ లక్ష్మీ నరసమ్మ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. అనంతరం స్థానిక బీసీ వసతి గృహంలో బాలికలకు ఖోఖో, కబడ్డీ పోటీలు నిర్వహించారు. విజేతలకు గ్రంథాలయ వారోత్సవాల ముగింపు రోజున బహుమతులు పంపిణీ చేస్తామని లైబ్రేరియన్ తెలిపారు.

యువ కవులను ప్రోత్సహించాలి

కనిగిరి రూరల్: యువ తెలుగు కవులను ప్రతి ఒక్కరూ ప్రోత్సహించాలని ప్రముఖ కవి, ఆంధ్ర కేసరి విశ్వ విద్యాలయం పాలక మండలి సభ్యుడు కొండ్రెడ్డి వెంకటేశ్వరరెడ్డి అన్నారు. 56వ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం కవి సమ్మేళనం జరిగింది. కవి కొండ్రెడ్డి వెంకటేశ్వరెడ్డి మాట్లాడుతూ తెలుగు బాష మీద నేటి తరానికి ఆసక్తిని పెంపొందిచాలన్నారు. జేవీవీ జాతీయ కార్యదర్శి ఎస్‌కే గయాజ్, బృంగి సుబ్రహ్మణ్యం, రవి, అంబటి పాలిరెడ్డి, ప్రసాద్‌రెడ్డి, పాపారాయుడు, అంకాళేశ్వరి, గోపాల కృష్ణారెడ్డి పాల్గొన్నారు. అంబటి పాలిరెడ్డి రాసిన జ్ఞానం భక్తి మోక్షానికి మార్గం, కొండ్రెడ్డి వెంకటేశ్వరరెడ్డి రాసిన నాగేటి గోడు అనేక పుస్తకాలను ఆవిష్కరించారు. తొలతు గ్రంథపాలకుడు ఎస్‌కే అహ్మద్ షరీఫ్ ఆధ్వర్యంలో సన్మానించారు.

గ్రంథాలయంలో కవి సమ్మేళనం

గుడ్లూరు: మండల కేంద్రమైన గుడ్లూరులో గ్రంథాలయ వారోత్సవాలు, కవి సమ్మేళనం నిర్వహించారు. కార్యదర్శి పి.మహేష్, హాస్టల్ వార్డెన్ సీహెచ్.శ్రీనివాసరావు, తెలుగు ఉపాధ్యాయులు ఎస్.చంద్రశేఖర్ మాట్లాడారు. గ్రంథపాలకుడు ఎల్.ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఉలవపాడు: స్థానిక గ్రంథాలయంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఉలవపాడులోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, సాయి ఒలింపియాడ్ స్కూల్, శాంతినికేతన్ స్కూల్, సెయింట్ జోసఫ్స్ స్కూల్, లిటిల్ ఏంజల్స్ స్కూల్, సెయింట్ పీటర్స్ పాఠశాలల నుంచి హాజరయ్యారు. గ్రంథపాలకుడు దాసరి కోటేశ్వరరావు పాల్గొన్నారు.

వరికి ప్రత్యామ్నాయం చూసుకోండి



మాట్లాడుతున్న ప్రధాన శాస్త్రవేత్త ప్రసాద్‌బాబు

కందుకూరు: వలేటివారిపాలెం మండలం వరి సాగుకు అనుకూలంగా కాదని బెంగళూరులోని నేషనల్ బ్యూరో ఆఫ్ సాయిల్ సర్వే అండ్ ల్యాండ్ ప్లానింగ్ సంస్థ నిర్ధారించిందని కృషి విజ్ఞాన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త జి. ప్రసాద్‌బాబు తెలిపారు. మండలంలో వరికి ప్రత్యామ్నాయ పంటలను రైతులు సాగు చేసుకోవాలన్నారు. నేషనల్ బ్యూరో ఆఫ్ సాయిల్ సర్వే అండ్ ల్యాండ్ ప్లానింగ్ సంస్థ ప్రధాన శాస్త్రవేత్త డీవీ రామ్మూర్తి బృందం శుక్రవారం మండలంలో పర్యటించింది. వలేటివారిపాలెం మండలం నీటి వనరులు తక్కువగా ఉన్నందున వేరుశనగ, నువ్వులు, జొన్న, మొక్కజొన్న వంటి పంటలు వేసుకోవచ్చునని తెలిపారు. కందుకూరు వ్యవసాయ సబ్ డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు పి. అనసూయ, ఏఓ హేమంత్ భరత్ కుమార్, ఉద్యానవన సహాయకులు వై. సుష్మ, వి. ఖాదర్‌బాష పాల్గొన్నారు.

పెట్రోల్ కల్తీ జరిగిందంటూ ఆందోళన



పెట్రోల్ పరిశీలిస్తున్న సిబ్బంది, ప్రశ్నిస్తున్న యువకులు

ఉలవపాడు: మండల పరిధిలోని జాతీయరహదారిపై మన్నేటికోట అడ్డరోడ్డు సమీపంలోఉన్న బీపీ కరేడు పెట్రోల్ బంకు నందు పెట్రోల్ లో నీరు కలిసిందని మన్నేటికోట గ్రామానికి చెందిన యువకులు ఆందోళనచేశారు. శుక్రవారం ద్విచక్రవాహనానికి 500 రూపాయలకు పెట్రోలు కొట్టించి ఉలవపాడు వెళ్లేసరికి బండి ఆగిపోయిందని, మెకానిక్ పెట్రోల్‌లో నీరు కలిసిందని చెప్పడంతో ఆ పెట్రోల్‌ను బాటిల్ లోపట్టి చూడగా కింద నీరు నిలిచిందని చెప్పారు. దీంతో సుమారు 25 మంది యువకులు వెళ్లి ప్రశ్నించారు. బంకు సిబ్బంది తమ వద్ద కల్తీ లేదని, మరలా బాటిల్‌లో కొట్టి చూపించారు. కానీ ఏదో కల్తీ జరిగిందని వారు తహసీల్దార్‌కు, డీఎస్ఓ కు ఫోన్ ద్వారా ఫిర్యాదు చేశారు. శనివారం వచ్చి బంకును పరిశీలిస్తామని వారు తెలియచేయడంతో శాంతించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్రగాయాలు



ప్రమాదానికి గురైన కారును పరిశీలిస్తున్న జిలానీబాషా

కొండపి(సింగరాయకొండ): వీధి కుక్కల మూక అడ్డురావడంతో కారు అదుపు తప్పి పక్కన ఉన్న చెట్టుకు ఢీకొనడంతో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన కొండపి మండలం ముప్పవరం మలుపు వద్ద శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. కొండపి మండలం చిన్న వెంకన్నపాలెం గ్రామానికి చెందిన విజయేంద్రవర్మ, కట్టా కమల్ కుమార్, కట్టా వంశీ ముగ్గురు యువకులు కొండపి నుండి చిన్నవెంకన్నపాలెం పోతుండగా ముప్పవరం మలుపు వద్ద కుక్కల మూక అడ్డు రావటంతో కారు అదుపు తప్పి పక్కనె ఉన్న చెట్టుకు బలంగా ఢీకొనగా కారు ముందు భాగం నుజ్జు నజ్జు కాగా కారులొ కట్టా కమల్ కుమార్, కట్టా వంశీలకు అయిర్ బ్యాగ్ ఓపెన్ కావటంతో ప్రమాదం తప్పింది. కారులో వెనుక ఉన్న విజయేంద్రవర్మ తలకి తీవ్ర గాయాలు కాగా, చికిత్స నిమిత్తం ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. ఏఎస్సై జిలాని బాషా సంఘటనా స్థలానికి చేరుకొని ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు.

వైఎస్సార్ సీపీ గ్రామ అధ్యక్షుడు మృతి

లింగసముద్రం: లింగసముద్రం వైఎస్సార్ సీపీ గ్రామ పార్టీ అధ్యక్షుడు, సీనియర్ నేత మట్లే నాగేశ్వరరావు (62) శుక్రవారం తెల్లవారుజామున గుండెపోటుతో మృతి చెందారు. ఆయన మృతిపట్ల ఎంపీపీ పెన్నా క్రిష్ణయ్య, కన్వీనర్ పిచ్చపాటి తిరపతిరెడ్డి, జేసీఎస్ కన్వీనర్ వరికూటి క్రిష్ణారెడ్డి, సర్పంచ్ పులి పెదరాఘవులు, పలువురు నాయకులు ప్రగాడ సానుభూతి కుటుంబ సభ్యులకు తెలియజేశారు.

అంకితభావంతో పనిచేయాలి

సీఎస్‌పురం (పామూరు): పారదర్శక ఓటర్ల జాబితా రూపకల్పనకు మండలంలోని బీఎల్‌ఓలు అంకితభావంతో పనిచేయాలని తహసీల్దార్ షేక్.నాగూర్ మీరా అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయ సమావేశ హాలులో శుక్రవారం మండలంలోని బీఎల్‌ఓల సమావేశం నిర్వహించారు. ఆర్ఐ పి. శ్రీధర్‌బాబు, డిప్యూటీ తహసీల్దార్ యం.సలోమి, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

ఆలయానికి రూ. 6 లక్షల విరాళం

సీఎస్‌పురం (పామూరు): మండలంలోని అయ్యలూరివారిపల్లె గ్రామ సమీపంలో నిర్మిస్తున్న తిరుమలనాథస్వామి ఆలయం, ఇతర గ్రూప్ టెంపుల్స్ నిర్మాణాలకు ఇరువురు దాతలనుండి శుక్రవారం రూ.6 లక్షల విరాళాలు వచ్చినట్లు తిరుమలనాథస్వామి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ టి.చలమయ్య నాయుడు తెలిపారు. చెన్నపునాయునిపల్లె గ్రామానికి చెంది ప్రస్తుతం నెల్లూరు నివాసియైన కోటా గురుబ్రహ్మం రూ.5 లక్షలు, డీజీపేట గ్రామానికి చెందిన ప్రస్తుతం పూనా నివాసియైన గోదాసు చినవేమయ్య రూ. 1 లక్ష విరాళంగా జమచేసినట్లు తెలిపారు.

బాలల హక్కుల పరిరక్షణ అందరి బాధ్యత

కనిగిరి రూరల్: బాలల హక్కుల పరిరక్షణ అందరి బాధ్యత అని ఐసీడీఎస్ సూపర్ వైజర్ పార్వతి అన్నారు. పాతపాడు జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో శుక్రవారం బాలల హక్కుల వారోత్సవాలు జరిగాయి. సర్పంచ్ అన్నమ్మ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పలువురు వక్తలు మాట్లాడుతూ బాలల హక్కులు, చట్టాలు, విద్య, తదితర అంశాలపై అవగాహన కల్పించారు. వివిధ సంస్థల ప్రతినిధులు కిరణ్ కుమార్, మండ్రు రమేష్, ఇన్‌చార్జి హెచ్‌ఎం సాబీర్, వీర్వో సునిత, కార్యదర్శి రాజేష్, ఎం నిర్మల, ఎస్. నందిని పాల్గొన్నారు.

పేదలందరికీ ప్రభుత్వ పథకాలు అందాలి



మాట్లాడుతున్న పంచాయతీరాజ్ రూరల్ డెవలప్‌మెంట్ డైరెక్టర్ చిన్న తాతయ్య

సింగరాయకొండ: పేదలందరికీ ప్రభుత్వ పథకాలు అందించి అభివృద్ధి చెందేలా చూడాలని పంచాయతీరాజ్ రూరల్ డెవలప్‌మెంట్ డైరెక్టర్ చిన్న తాతయ్య పేర్కొన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎన్ఆర్ఈజీఎస్, ఐకేపీ, ఉపాధి హామీ, వెలుగు అధికారులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తాతయ్య మాట్లాడుతూ.. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు పేదలకు సకాలంలో అందేలా చూడాలని, వారి జీవనోపాధి మెరుగుపడేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. అనంతరం అయా శాఖల అధికారులకు దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో ఉపాధి హామీ పథకం పీడీ శీనారెడ్డి, ఏపీఓ సుధాకరరావు, ఏపీఎం జయరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయ స్థాయి హ్యాండ్ బాల్ పోటీలకు దిరిశవంచ విద్యార్థిని

కనిగిరి రూరల్: జాతీయ స్థాయి హ్యాండ్ బాల్ పోటీలకు మండలంలోని దిరిశవంచ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని తొమ్మిదో తరగతి విద్యార్థిని కె. ప్రసన్న ఎంపికైంది. నవంబర్ 9,10,11 తేదీల్లో విజయవాడలో జరిగిన రాష్ట్ర స్థాయి హ్యాండ్ బాల్ పోటీల్లో ప్రతిభ కనబర్చినట్లు పీడీ నేలటూరి జ్యోతి బాబు తెలిపారు. డిసెంబర్‌లో దేశ రాజధాని ఢిల్లీలో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో ప్రసన్న పాల్గొననుంది. ఈమేరకు ప్రతిభ చూపిన విద్యార్థిని కె. ప్రసన్నను శుక్రవారం ప్రధానోపాధ్యాయుడు వి. శ్రీనివాసులు అభినందించారు.

కవిత్వంపై అవగాహన పెంచుకోవాలి



క్విజ్ పోటీలు నిర్వహిస్తున్న విశ్రాంత ప్రధానోపాధ్యాయులు

కందుకూరు రూరల్: విద్యార్థులు కవిత్వం, రచనల పట్ల అవగాహన పెంచుకోవాలని విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు వీవీ శేషయ్య, వీరరాఘవులు, విశ్రాంత ఎంపీడీఓ జీవీ శేషగిరిరావు సూచించారు. కందుకూరులోని శాఖ గ్రంథాలయ 56వ జాతీయ వారోత్సవాలు నిర్వహించారు. విద్యార్థి దశ నుంచే కవిత్వంపై పట్టు సాధించాలని సూచించారు. అనంతరం విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. గ్రంథపాలకురాలు పి.నాగరజిని, విశ్రాంత బ్యాంక్ ఉద్యోగి దండోరా దాసు పాల్గొన్నారు.

పకడ్బందీగా ఓటరు తుది జాబితా

టంగుటూరు: నూతన ఓటరు తుది జాబితాను బీఎల్వోలు పకడ్బందీగా నిర్వహించాలని తహసీల్దార్ సింగారావు అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్వోలు, సచివాలయ పోలీసులు, సచివాలయ సిబ్బంది, బీఎల్వోలు, సచివాలయ సిబ్బందికి ఓటరు చేర్పులు, మార్పులపై శిక్షణ, అవగాహన కార్యక్రమం శుక్రువారం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ.. గ్రామాల్లో మృతి చెందిన ఓట్లను తొలగించే సమయంలో కుటుంబ సభ్యుల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. కుటుంబంలోని ఓట్లు ఒకే ఇంటి నంబరు, బూత్‌లో ఉండేలా చూడాలన్నారు. అనంతరం పలు సలహాలు సూచనలు చేశారు.

నేడు సర్వ సభ్య సమావేశం

కొండపి(సింగరాయకొండ): కొండపి మండల పరిషత్ కార్యాలయంలో శనివారం సాధారణ సర్వ సభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ రమణమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని అన్ని శాఖల అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచులు పాల్గొనాలని కోరారు.